క్లుప్తంగా

ప్రతిభ చాటిన సిద్ధార్థ విద్యార్థులు



పెనమలూరు: కానూరు వెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ లా కాలేజీ విద్యార్థులు చామర్తి భావన, ఎస్.అజయ్‌ప్రకాష్, బి.ఉదయ్‌కుమార్‌లు ఈనెల 15వ తేదీన విశాఖపట్నంలోని ఎన్‌వీపీ లా కాలేజీలో జరిగిన ఆల్వార్డాస్ జాతీయ మూట్ కోర్ట్ పోటీల్లో ప్రతిభ చాటారు. విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి రూ. 30 వేలు నగదు బహుమతి, ప్రతిభా సర్టిఫికెట్‌లు పొందారు. దేశవ్యాప్తంగా 24 బృందాలు ఈ పోటీలో పాల్గొనగా సిద్ధార్థ లా కాలేజీ విద్యార్థులు సత్తాచాటి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా కాలేజీలో మంగళవారం విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నుపాటి దివాకర్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థులకు క్రీడలు ఎంతో కీలకం

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థుల శారీరక, మానసిక వికాసంతోపాటుగా నైతిక విలువలు పెంపొందించడానికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయని గన్నవరం నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఇన్‌ఛార్జి సీహెచ్ చంద్రశేఖరరావు అన్నారు. బాపులపాడు మండలం ఆరుగొలనులోని జెడ్పీ హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయి వ్యాయామోపాధ్యాయుల స్పోర్ట్స్ కాంప్లెక్స్ కార్యక్రమం మంగళవారం జరిగింది. క్రమశిక్షణ కలిగిన విద్యార్థులను తీర్చిదిద్దడంలో వ్యాయామోపాధ్యాయుల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యోగా, ఫిట్‌ఇండియా, ఖేలోఇండియా, ఏరోబిక్స్ ప్రాక్టికల్ అంశాలపై అవగాహన కల్పించారు. గన్నవరం సబ్ జోన్ అధ్యక్షుడు పామర్తి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు బీఎస్ రామచంద్రుడు, విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు అక్కినేని రాఘవేంద్రరావు, పలువురు పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం



కంకిపాడు: నులి పురుగుల నివారణతో ఆరోగ్యం వృద్ధి చెందుతుందని ఎంపీడీవో పి.అనూష అన్నారు. నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉప్పలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల ఉపాధ్యాయులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం కంకిపాడు జెడ్పీ పాఠశాలలో నులి పురుగుల మాత్రలు పంపిణీని ఎంపీడీవో ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ చిన్నారులు, పాఠశాలల విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్, ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం: మండలంలోని అల్లాపురం ఎంపీపీ పాఠశాలలో మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులకు గ్రామ సర్పంచి డొక్కు సాంబశివ వెంకన్నబాబు నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు ప్రతియేటా క్రమం తప్పకుండా నులి పురుగుల నివారణ మాత్రలు వేయాలని పేర్కొన్నారు. పంచాయతీ పాలవకర్గ సభ్యుడు అవుటపల్లి శివప్రసాద్, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బధిరులకు దుప్పట్ల పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడురోడ్డులోని ఆదిత్య బధిరుల విద్యాలయంలో దాతలు దుప్పట్ల పంపిణీ, అన్నదానం నిర్వహించారు. అన్నపూర్ణ ఏజెన్సీస్ అధినేత నూలు నరసింహారావు 60 మంది చెవిటి, మూగ, అనాథ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం బధిర విద్యార్థులకు అన్నదానం చేశారు. ఆదిత్య బధిరుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఆకుల వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలోని జూనియర్ ఇంటర్ మహిళా కళాశాలలో విద్యార్థులకు కనీస సదుపాయలు కల్పించాలని కోరుతూ వారి తల్లిదండ్రులు మంగళవారం ఆందోళన చేపట్టారు. కళాశాలలో కనీసం మరుగుదొడ్ల సదుపాయం కూడా లేదని, ఇదేమని ప్రశ్నిస్తే ప్రిన్సిపాల్, అధ్యాపకులు సమాధానం కూడా చెప్పడం లేదన్నారు. తల్లిదండ్రుల ఆందోళనతో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా పోలీసులు అక్కడికి చేరుకుని చర్చలు జరపడంతో వారు ఆందోళన విరమించారు. అయితే కళాశాలలో నెలకొన్న సమస్యలను, ప్రిన్సిపాల్ వ్యవహార శైలిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద జామియా మసీద్‌లో సోమవారం రాత్రి మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా షహదుల్ హుసేన్ మాట్లాడుతూ ప్రవక్త చూపిన మార్గం ఆదర్శమన్నారు. మసీద్ ఇమాం హసీన్ ఇక్బాల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



గన్నవరంలో ఆర్టీసీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీటీఓ వాణిశ్రీ



కానూరులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కమిషనర్ వెంకటేశ్వరరావు



నున్న గ్రామంలో మానవహారం



పెనమలూరులో స్వచ్ఛతాహీ సేవ ర్యాలీలో ఎంపీడీవో సునీతాశర్మ, ఏఓ శివశంకర్

- ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి వాణిశ్రీ
- ఘనంగా స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలు



కంకిపాడులో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో పి.అనూష, ప్రజాప్రతినిధులు, అధికారులు

గన్నవరం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా గుర్తించాలని ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారిణి ఎ.వాణిశ్రీ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్టీసీ డిపోలో స్వచ్ఛతాహీ సేవ పక్షోత్సవాలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ.. స్వభావ స్వచ్ఛత-సంస్కార స్వచ్ఛత అనే నినాదంతో పక్షోత్సవాలను నిర్వహించాలని చెప్పారు. ప్రతి కార్మికుడు పనిచేసే చోట శుభ్రతను పాటించాలని సూచించారు. ఏడాదిలో కనీసం వంద గంటలు శ్రమదానం చేయడం ద్వారా పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతోపాటు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. డిపో మేనేజర్ పి.శివాజీ, సూపర్‌వైజర్లు మధు, రజనీకాంత్, సురేష్, యూనియన్ నాయకులు నాగిరెడ్డి, టీవీ కోటేశ్వరరావు, సంజీవరావు పాల్గొన్నారు.

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీని పచ్చదనం, పరిశుభ్రంగా ఉంచే బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కానూరులో మంగళవారం స్వచ్ఛతాహీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, టీడీపీ నేతలు వెలగపూడి శంకర్‌బాబు, దోనేపూడి రవి తదితరులు పాల్గొన్నారు.

అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఎంపీడీవో సునీతాశర్మ, మండల పరిషత్ ఏఓ లోయ శివశంకర్ పాఠశాల విద్యార్థులతో కలిసి పారిశుద్ధ్య కార్యక్రమం, మానవహారం నిర్వహించారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. పారిశుద్ధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులకు మెడికల్ క్యాంపు నిర్వహించి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎంఈఓ కనకమహాలక్ష్మి, హెచ్‌ఎం దుర్గాభవాని, విద్యార్థులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కంకిపాడు: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. కంకిపాడు, ఈడుపుగల్లు గ్రామాల్లో నిర్వహించిన ప్రదర్శన, మానవహారాలకు మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. విద్యా ర్థులు ప్లకార్డులు చేతబట్టి స్వచ్ఛతాహీ సేవ అంటూ నినాదాలు చేశారు. ఎంపీడీఓ అనూష మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో స్వచ్ఛత ప్రాధాన్యత ఎంతో కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై దృష్టి సారించాలని సూచించారు. ఎంఈఓ-2 కేఎస్‌వీ ప్రసాద్, కంకిపాడు సర్పంచ్ బాకీ రమణ, ఈడుపుగల్లు సర్పంచ్ పి.ఇందిర, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, ఆయా గ్రామాల కార్యదర్శులు, పాఠశాలల హెచ్‌ఎంలు, పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి జిటివి. రమణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, పాలక వర్గ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించి, ర్యాలీ చేశారు.

విద్యార్థుల మానవహారం



నిడమానూరు జెడ్పీ పాఠశాలలో విద్యార్థుల మానవహారం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లో ఆయా పంచాయతీల ఆధ్వర్యాన మంగళవారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలు నిర్వహించారు. నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతాకి భగీరథి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ శీలం రంగారావు మాట్లాడుతూ ఈ కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములు చేస్తూ ఆరోగ్యశాఖ ద్వారా సురక్షితమైన వైద్య సేవలను చేపడతామని తెలిపారు. ప్రసాదంపాడులో సర్పంచ్ సర్నాల బాలాజీ గంగారత్నం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ నాథ్, రాజేంద్రప్రసాద్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సమన్వయకర్తను కలిసిన పార్టీ శ్రేణులు



పెనమలూరు: వినాయక ఉత్సవాల్లో పాల్గొని వేలంపాటలో లడ్డూను కైవసం చేసుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులను పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అభినందించారు. వణుకూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేతలు గ్రామంలో జరిగిన వినాయకుడి లడ్డూ వేలంపాటలో రూ. 13,333కు కైవసం చేసుకున్నారు. దీంతో మంగళవారం లడ్డూతో కానూరుకు వచ్చి సమన్వమకర్త చక్రవర్తిని కలిశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత చక్కా గోపి పాల్గొన్నారు.

నేటి నుంచి ముస్తాబాద దర్గా ఉత్సవాలు



గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాదలో కొండపై ఉన్న హజరత్ సయ్యద్ ముస్తఫావలీ అవులియా 59వ దర్గా ఉరుసు మహోత్సవాలు బుధవారం రాత్రి ప్రారంభమవుతాయని ముజావర్లు జబీ ఉల్లా మహిబుల్లా తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ బుధవారం రాత్రి ముజావర్ల ఇంటి నుంచి గంధం బయలుదేరుతుందని చెప్పారు. గురువారం రాత్రి మీలాద్ జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని కోరారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం పెదపులిపాక, యనమలకుదురు గ్రామాలకు చెందిన వరద బాధిత నాయీ బ్రాహ్మణ కుటుంబాలకు న్యూస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, కులవృత్తి కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత ఐపీఎస్ అధికారి రవీంద్రనాథ్‌బాబు మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన నాయీ బ్రాహ్మణ కుటుంబాలకు తమ వంతు సాయం చేయాలని న్యూస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా వారికి ఎటువంటి ఆపద వచ్చినా తమ వంతు సహకారం అందిస్తామన్నారు. నాయీ బ్రాహ్మణ సంఘ నేతలు మాల్కాపురం కనకారావు, గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, ద్రాక్షరపు సూరిబాబు, ఆకునూరు సుబ్బారావు, అయోధ్య సత్యనారాయణ, తెన్నేటి ప్రకాష్, వణుకూరు విక్రమ్, బాలకృష్ణ పాల్గొన్నారు.



వరద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న విశ్రాంత ఐపీఎస్ అధికారి రవీంద్రనాథ్‌బాబు

జాతీయ ఫార్మ కో-విజిలెన్స్ వారోత్సవాలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో మంగళవారం జాతీయ ఫార్మ కో-విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన నరసరావుపేట ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, ఫార్మసి ప్రాక్టీస్ విభాగాధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ నోరి కోదండరామ్ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ప్రతికూల చర్యలు లేని మందులను తీసుకొనే హక్కు ఉందన్నారు. మందుల దుష్ప్రభావంపై విద్యార్థులకు అవగాహణ కలిగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ మందులు తయారు చేసినప్పటి నుంచి రోగికి చేరే వరకు అవి ఏ విధంగా పనిచేస్తాయో ఫార్మసి విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రతికూల చర్యలు ఏర్పడినప్పుడు ఏ విధంగా తమ ఫిర్యాదులు తెలపాలో ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. ఇటీవల 156 రకాల మందులను సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నిషేధించిందని కళాశాల విభాగాధిపతి వినయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఎన్. సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

గన్నవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మంగళవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ పతాకాన్ని గన్నవరం విమానాశ్రయం సివిల్ జనరల్ మేనేజర్ కొండోజు రామాచారి ఆవిష్కరించారు. అనంతరం విశ్వబ్రాహ్మణ సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ సృష్టికర్త విశ్వకర్మకు పూజలు నిర్వహించారు. రామాచారి మాట్లాడుతూ.. సకల కళలకు, సృజనాత్మకతకు విశ్వకర్మ అధినేత అని పేర్కొన్నారు. మానవ మనుగడకు అవసరమైన వృత్తులకు ఆద్యుడైన ఆయన ప్రపంచ నాగరికతకు మూలపురుషుడిగా అభివర్ణించారు. అనంతరం పలు చేతివృత్తుల కార్మికులు తమ పనిముట్లను స్వామివారి సన్నిధిలో ఉంచి పూజలు జరిపారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పుట్టా రామబ్రహ్మం, ఆలయ కమిటీ సభ్యుడు సత్యానారాయణ, నవరత్నాచారి, వెంకటచారి, వజ్రాల రాంబాబు, పుట్టా సుధీర్, రాపాక నాగరాజు, సర్వేశ్వరరావు, భాస్కరచారి పాల్గొన్నారు.



పతాకావిష్కరణలో పాల్గొన్న సంఘ నేతలు

పీఎం ఆవాస్ యోజన ఇళ్లు ప్రారంభం

గన్నవరం: మండలంలోని మర్లపాలెంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మించిన గృహాలను మంగళవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. అనంతరం గృహనిర్మాణ సముదాయంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. గృహ నిర్మాణానికి ఒక్కొక్క లబ్ధిదారుడికి రూ. 1.80 లక్షలు ఇస్తున్నట్లు చెప్పారు. వైస్ ఎంపీపీ కొమ్మురాజు సుధీర్, ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు, పడమట రంగారావు పాల్గొన్నారు. అనంతరం వరద బాధితులైన జర్నలిస్టులకు ఏపీయూడబ్ల్యూజే నేతృత్వంలో దాతల సహకారంతో వంట సామగ్రి, దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు.



గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

ఏలూరు కాలువ గండి పూడ్చివేయాలని వినతి

గన్నవరం: మండలంలోని కేసరపల్లి వద్ద ఏలూరు కాలువకు పడిన గండి పూడ్చివేతకు తక్షణ చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ డీకే. బాలాజీకి వినతిపత్రం పంపించారు. కేసరపల్లి శివారు అప్పారావుపేట వద్ద ఏలూరు కాలువకు గండిపడి పదిహేను రోజులు గడుస్తున్నా ఇంతవరకు పూడ్చలేదని తెలిపారు. దీనివల్ల వందలాది ఎకరాలు ముంపులో చిక్కుకుని పంట దెబ్బతినడంతోపాటు పక్కనే ఉన్న జగనన్న కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. యుద్ధప్రతిపాదకన గండిని పూడ్చివేయాలని కోరారు.

మరమ్మతులకు ఎదురుచూపులు

- రైవస్ కాలువపై కుందేరులో బెయిలీ బ్రిడ్జి
- తుప్పుపట్టి దెబ్బతింటున్న రేకులు
- పంట రవాణా నాటికి మరమ్మతులు చేయాలని డిమాండ్



పైకి లేచిన బ్రిడ్జికి అమర్చిన రేకులు

కంకిపాడు: తుప్పు పట్టి పాడైపోతున్న ఇనుప రేకులు.. పైకిలేచి ప్రమాదకరంగా ఉన్న రేకులు. బ్రిడ్జి ఇలా ఉంటే రవాణా ఎలా? అంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పలు గ్రామాల గుండా రైవస్ కాలువ ప్రవహిస్తుంది. కుందేరు గ్రామంలో రైవస్ కాలువపై గతంలో శాశ్వత వంతెన ఉండేది. దీని మీదుగా కందలంపాడు, మానికొండ గ్రామాలకు, కంకిపాడు-గుడివాడ రోడ్డు మార్గాన్ని కలిపే రహదారి మార్గం ఉంది. 2006లో శాశ్వత వంతెన కుప్పకూలింది. దీంతో ఆ స్థానంలో తాత్కాలిక ప్రాతిపదికన బెయిలీ బ్రిడ్జి నిర్మించారు. పూర్తిగా ఇనుప బద్దెలు, రేకులు వినియోగించి బ్రిడ్జిని నిర్మించి ప్రజల రాకపోకలకు అందుబాటులోకి తెచ్చారు.

ఏళ్ల తరబడి ఈ బ్రిడ్జి ఆధారం...

రైవస్ కాలువపై శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టినా భూ సేకరణ, నిధుల లేమి సమస్యలతో నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో ప్రత్యామ్నాయంగా బెయిలీ బ్రిడ్జి మీదుగానే రాకపోకలు సాగిస్తున్నారు. తరచూ బ్రిడ్జిపై ఉన్న ఇనుప రేకులు తుప్పు పట్టి ధ్వంసమవుతున్నాయి. రేకులు దెబ్బతిన్న ప్రతిసారీ ఆర్‌అండ్‌బీ అధికారులు రేకులను మార్పు చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

రేకులు దెబ్బతిన్న వాటిని మార్చడం కోసం ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు నివేదిస్తున్నాం. పూర్తి స్థాయిలో రేకులు మార్చాలంటే రూ. 70 లక్షల వరకూ ఖర్చు అవుతుంది. తాత్కాలిక మరమ్మతులకు నిధులు వస్తే పాడైన రేకులు మార్చడానికి ఆస్కారం ఉంటుంది.

– మల్లికార్జున, ఏఈ, ఆర్‌అండ్‌బీ

అయితే వాహనాల తాకిడి, కుందేరు పరిసర గ్రామాల నుంచి వరి, చెరకు ఇతర పంట రవాణా తరలింపుతో బ్రిడ్జి రేకులు దెబ్బతింటున్నాయి. ప్రస్తుతం బ్రిడ్జికి అమర్చిన రేకులు తుప్పు పట్టి పాడైపోయి, రేకులు లేచి ఉన్నాయి. దీంతో రాత్రిళ్లు ఈ మార్గంలో ప్రయాణం అంటేనే వాహనదారులు భయపడుతున్నారు. వరి, చెరకు పంటలు చేతికి వచ్చేనాటికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

18, 19న ఐడీఈ బూట్ క్యాంపు

ఉంగుటూరు: ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో ఐడీఈ బూట్ క్యాంపును ఈనెల 18, 19వ తేదీల్లో నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం తెలిపారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ), మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ సెల్(ఎంఐసీ)రెండు రోజుల ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్(ఐడీఈ) బూట్ క్యాంపులో పాఠశాలల ప్రిన్సిపాల్స్, సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

నున్న(విజయవాడరూరల్): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని ఈజీఎస్(ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్) డైరెక్టర్ వైవీకే షణ్ముఖకుమార్ అన్నారు. ప్లాంటు ఫర్ మథర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నున్న జెడ్పీ హైస్కూల్‌లో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఎండల తీవ్రత అధికంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 45వేల ఎకరాల్లో మొక్కలు నాటడం జరిగిందన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించి వారితో మొక్కలు నాటించాలని సూచించారు. జాయింట్ కమిషనర్ శివప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జె.సునీత, ఈఓఆర్డీ ఎం.దుర్గాప్రసాద్, కార్యదర్శి జిటివి. రమణ, ఈసీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



నున్న జెడ్పీ హైస్కూల్లో మొక్క నాటుతున్న ఈజీఎస్ డైరెక్టర్ వైవీకే షణ్ముఖ, జేసీ శివప్రసాద్

ఇరువురిపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: వణుకూరులో వ్యక్తిపై నలుగురు వ్యక్తులు దాడి చేయడంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకట రమణ కథనం మేరకు వణుకూరు గ్రామానికి చెందిన షేక్ మాబుసుభానిపై అదే గ్రామానికి చెందిన ఉయ్యూరు మహేష్, కొక్కలిగడ్డ రోహిత్, పాలా రాజ్‌కుమార్, లాం జెస్సిన్ అకారణంగా తగాదాపడి రాడ్‌తో దాడి చేశారు. ఈ దాడిలో మాబుసుభాని తలకు గాయాలు అవడంతో కంకిపాడు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెదపులిపాకలో...

పెదపులిపాక గ్రామంలో వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేసిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు పెదపులిపాక శ్రీనగర్‌కు చెందిన పసుపులేటి నాగాంజనేయులు ఆటో డ్రైవర్‌గా పని చేస్తాడు. అతను, మణికంఠ అనే వ్యక్తి సమీప ఇళ్లల్లో ఉంటున్నారు. అయితే ఈనెల 15వ తేదీన నాగాంజనేయులు భార్య హేమలత, మణికంఠ భార్య సునీత మాట్లాడుకుంటుండగా మణికంఠ చూసి నాగాంజనేయులకు ఫోన్ చేసి నీ భార్య నా ఇంటికి ఎందుకు వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో నాగాంజనేయులు మణికంఠ వద్దకు వెళ్లాడు. ఆగ్రహంతో ఉన్న మణికంఠ రాయితో నాగాంజనేయులుపై దాడి చేశాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు జాతీయ రహదారులను సుందరీకరించేందుకు నేషనల్ హైవేల సమీపంలో మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపట్టామని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) విజయవాడ ప్రాంతీయ అధికారి ఆర్‌కే సింగ్ చెప్పారు. విజయవాడ సమీపంలోని చినఅవుటపల్లి దగ్గర మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) నిర్మిస్తున్న చినఅవుటపల్లి-గొల్లపూడి బైపాస్ రోడ్డులో ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఆర్‌కే సింగ్ హాజరై విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారుల వెంట పర్యావరణాన్ని కాపాడటంతో పాటు వాహనదారులకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ విజయవాడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు సంభవించినపుడు నేల కోతకు గురి కాకుండా చెట్లు కాపాడతాయన్నారు. మొక్కల పెంపకంతో పాటు జాతీయ రహదారులను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తామంటూ ఎన్‌హెచ్‌ఏఐ, ఎంఈఐఎల్ అధికారులు, సిబ్బందితో పాటుగా పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.